



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు. ఇన్‌సెట్‌లో సర్వాలంకరణ శోభిత మారియమ్మన్

కనుల పండువగా సమయపురం మారియమ్మన్ రథోత్సవం

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమయపురంలోని మారియమ్మన్ మహారథోత్సవం మంగళవారం ఉదయం కనులపండువగా జరిగింది. ఈ ఆలయంలో యేటా చిత్తిరై ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆ మేరకు ఈ యేడాది ఉత్సవాలు ఈ నెల 7న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వారం రోజులుగా ప్రతిరోజూ అమ్మవారు ప్రత్యేక అలంకారాలతో సింహవాహనం, భూతవాహనం, హంసవాహనం, వృషభవాహనం, గజ వాహనం, శేషవాహనం, అశ్వ తదితర వాహనాల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైంది. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, స్వర్ణ, వజ్రాభరణాలను అలంకరించి రథంలోని ప్రత్యేక పీఠంపై ఆధిష్ఠింపజేశారు ఆ తర్వాత వేలాదిమంది భక్తులు రథానికి ఇరువైపులా ఉన్న మోకుతాళ్లను పట్టుకుని లాగుతూ 'ఓంశక్తి... పరాశక్తి' అంటూ భక్తిపారవశ్యంతో నినాదాలు చేశారు. ప్రధాన వీధుల్లో ఊరేగిన తర్వాత మహారథాన్ని రథమండపం ప్రాంతానికి చేర్చారు. ఈ వేడుకల్లో భక్తులు ఒంటికి శూలాలు గుచ్చుకుని, కావళ్లు మోస్తూ పాల్గొన్నారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు పొరుగు జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుండి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ఈ రథోత్సవం సందర్భంగా తిరుచ్చి జిల్లాకు మంగళవారం సెలవు ప్రకటించారు.

మాజీ మంత్రి ఇందిరా కుమారి మృతి

● సీఎం స్టాలిన్ నివాళి



ఇందిరా కుమారి పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న స్టాలిన్, దయానిధి మారన్ తదితరులు

అడయార్, ఏప్రిల్ 16: డీఎంకే సీనియర్ మహిళా నేత, మాజీ మంత్రి ఇందిరాకుమారి(74) సోమవారం రాత్రి కన్నుమూశారు. ఆమె పార్థివదేహానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. మాజీ మంత్రి, డీఎంకే సాహిత్య విభాగ అధ్యక్షురాలిగా ఉన్న ఇందిరా కుమారి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వచ్చారు. ఆమె భౌతికకాయాన్ని స్థానిక అడయారులోని ఇందిరా నగర్‌లోని ఆమె స్వగృహంలో ప్రజలు, డీఎంకే కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. ఈ నేపథ్యంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం ఉదయం ఇందిరా నగర్ వెళ్లి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, తన సంతాపాన్ని తెలిపారు సీఎం వెంట ఆయన సతీమణి దుర్గా స్టాలిన్, మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, సెంట్రల్ చెన్నై డీఎంకే లోక్‌సభ అభ్యర్థి దయానిధి మారన్ తదితరులు ఉన్నారు. మంగళవారం అంత్యక్రియలు ముగిశాయి.

నేటితో ప్రచారం పరిసమాప్తం



● స్వస్థలాలకు స్థానికేతరుల తరలింపు

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంతో పాటు పుదుచ్చేరి సహా 40 లోక్‌సభ నియోజకవర్గాలకు ఒకే విడతలో ఈనెల 19న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టం ఈనెల 17న బుధవారం సాయంత్రం 6 గంటలతో ముగియనుంది. రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు సహా మొత్తం 950 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇక కన్నియాకుమారి జిల్లాలోని విలవంగోడు శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నిక కూడా లోక్‌సభ ఎన్నికలతో పాటే నిర్వహించనున్నారు. ఆ నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే నాయకత్వంలో ఇండియా కూటమి అభ్యర్థులు, బీజేపీ నాయకత్వంలో ఎన్డీయే అభ్యర్థులు, అన్నాడీఎంకే కూటమి అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ మూడు పార్టీలతోపాటు సీమాన్ నాయకత్వంలో నామ్‌తమిళర్ కట్చికూడా గట్టి పోటీ ఇస్తుండటంతో చతుర్ముఖ పోటీ నెలకొంది. రెండు వారాలుగా ప్రచారం తారస్థాయికి చేరింది. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తదితర నాయకులు ప్రచారం చేశారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, డీపీఐ నేత తోల్ తిరుమావళవన్, టీఎంసీ నేత జీకే వాసన్, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్ ముమ్మరంగా ప్రచారం జరిపారు. మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, అమ్మామక్కల్ మున్నేట్ర కళగం అధినేత టీటీవీ దినకరన్ ఎన్డీయే కూటమి తరపున పోటీ చేయడమే కాకుండా ఆ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. ఇక ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా మక్కల్ నీది మయ్యం నాయకుడు కమలహాసన్ కూడా రోడ్‌షోలు నిర్వహించి ప్రచారం చేశారు.

నేడు నేతల ప్రచారం...

ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం 6గంటలకు ఎన్నికల ప్రచారం ముగియనుంది. డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చెన్నైలోని సెంట్రల్ చెన్నై, సౌత్ చెన్నై నియోజకవర్గాల్లో రోడ్‌షోలు జరిపి ప్రచారం చేస్తారు. చివరగా సాయంత్రం 4 గంటలకు బిసెంటన్‌నగర్ మహాత్మాగాంధీ రోడ్డులో ఏర్పాటయ్యే బహిరంగ సభలో ప్రసంగించి తన ప్రచారాన్ని ముగించనున్నారు. మంత్రి ఉదయనిధి మంగళవారం ఈరోడ్, తిరుప్పూరు నియోజకవర్గాల్లో సుడిగాలి ప్రచారం చేశారు. బుధవారం కోయంబత్తూరులో రోడ్‌షోలు జరిపిన తరువాత అక్కడి శివానం కాలనీలో తన ప్రచారాన్ని ముగించనున్నారు. కోయంబత్తూరు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అక్కడి గాంధీపురం బస్‌స్టేషన్ వద్ద ప్రచారాన్ని ముగిస్తారు. నీలగిరి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ ఊటీలో ప్రచారాన్ని ముగించనున్నారు. ఎండీఎంకే నేత వైగో తిరుచ్చి సెంట్రల్ బస్‌స్టేషన్ ప్రాంతంలో ప్రచార్నాన పూర్తి చేస్తారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు సేలం అస్తంపట్టి నుండి ప్రచారాన్ని ప్రారంభిస్తారు. సేలం టౌన్ పోలీసుస్టేషన్ సమీపంలో ఏర్పాటయ్యే బహిరంగసభలో పాల్గొని ఆయన తన ప్రచారాన్ని ముగిస్తారు. నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్ బుధవారం ఉదయం అంబత్తూరు రాఖీ థియేటర్ వద్ద ప్రచారాన్ని ప్రారంభిస్తారు. అక్కడి బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 6గంటలకు పురుషవాక్కం తానా వీధిలో తన ప్రచారాన్ని ముగించనున్నారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై బుధవారం శ్రీపెరుంబుదూరు నియోజకవర్గంలో సుడిగాలి ప్రచారం చేసిన తర్వాత పూందమల్లి సభలో పాల్గొని ప్రచారాన్ని ముగిస్తారు. టీఎంసీ అధినేత జీకే వాసన్ కూడా శ్రీపెరుంబుదూరులో జరిగే బహిరంగ సభలో పాల్గొన్ని ప్రచారాన్ని ముగించనున్నారు. మనిదనేయ మక్కల్ కట్చి నాయకుడు జవాహిరుల్లా శ్రీపెరుంబుదూరు డీఎంకే అభ్యర్థి టీఆర్ బాలుకు మద్దతుగా ప్రచారం చేస్తారు. డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ చిదంబరంలో తన ప్రచారాన్ని ముగించనున్నారు. పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ ధర్మపురిలో పోటీ చేస్తున్న సతీమణి సౌమ్యకు మద్దతుగా ఓట్ల వేట సాగించనున్నారు. సాయంత్రం ఆ నియోజకవర్గంలోనే తన ప్రచారాన్ని ముగిస్తారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్ దిండుగల్‌లో, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ నాగపట్టినం జిల్లా తిరుత్తురైపూండిలో ప్రచారాన్ని ముగించనున్నారు.

రాష్ట్రాన్ని బలహీనపరిచేందుకు మోదీ కుట్ర

● సీఎం స్టాలిన్ ధ్వజం



కొళత్తూరు జీకేఎం కాలనీలో ఓ ఇంటి వద్ద కరపత్రం పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ తరహా పరిపాలన సాగుతున్న రాష్ట్రాన్ని బలహీన పరిచేందుకు ప్రధాని నరేంద్రమోదీ కుట్ర పన్నుతున్నారని డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం తన 'ఎక్స్' పేజీలో ప్రకటన జారీ చేశారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే నియోజకవర్గాల పునర్విభజన పేరుతో లోక్‌సభలో సభ్యుల సంఖ్యను విపరీతంగా పెంచనున్నదని, కొత్త పార్లమెంట్ భవనంలో 888 మంది సభ్యులు కూర్చునేలా ఉన్న సీట్ల అమరికను రాష్ట్రాలపై వేలాడుతున్న కత్తిగా భావించవచ్చన్నారు. జనాభాను నియంత్రించిన రాష్ట్రాలను శిక్షించేలా జనాభాను నియంత్రించని రాష్ట్రాల లబ్ధిని చేకూర్చేందుకు జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సభ్యుల సంఖ్యను పెంచేందుకు మోదీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర హక్కులన్నింటినీ హరించేందుకు మోదీ ప్రయత్నాలు ప్రారంభించారని, ఇప్పటికే రాష్ట్రానికి వరద సహాయక నిధులు విడుదల చేయకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారన్నారు. మళ్ళీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి చిల్లిగవ్వ కూడా ఇవ్వరని స్టాలిన్ పేర్కొన్నారు. ప్రధాని మోదీకి అంటే బీజేపీకి ఓటు వేయడం, అన్నాడీఎంకే ఓటు వేయడం ఒక్కటేనని, ఈరెండు పార్టీలకు వేసే ఓట్లు రాష్ట్రానికి తీరని నష్టాలను కలిగిస్తాయన్నారు. రాష్ట్రంలోని ఓటర్లంతా మేలుకోకపోతే ఇక మిగిలేది అంధకారమేనని స్టాలిన్ అన్నారు. బీజేపీని, ఆ పార్టీతో రహస్య సంబంధాలు కొనసాగిస్తున్న అన్నాడీఎంకేని ఈ ఎన్నికల్లో తమిళ ప్రజలంతా బహిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు.

40 సీట్లు మావే...

లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ఆంగ్ల అంతర్జాతీయ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. గత మూడేళ్లుగా తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమపథకాలే తమ కూటమి విజయానికి దోహదపడతాయని, ప్రజల్లో తమపై ఎలాంటి ఆగ్రహం లేదని స్పష్టం చేశారు. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో వారెంటీలు లేని గ్యారెంటీలతో నిండి ఉన్నాయని, పదేళ్లుగా దేశాభివృద్ధిని విస్మరించిన మోదీ ప్రభుత్వం మేనిఫెస్టోలోని హామీలను ఎట్టి పరిస్థితుల్లో అమలు చేయదని దేశ ప్రజలందరికీ తెలిసిన విషయమేనని చెప్పారు. ప్రజల మేలు కోరే, దేశాన్ని ప్రగతిపథంలో పయనింపజేసే వ్యక్తి ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. ప్రధాని మోదీతో తనకు వ్యక్తిగతంగా ఎలాంటి కోపం లేదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా తమ ఇరువురి మధ్య సన్నిహిత సంబంధాలున్నాయని, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇరువురూ కలిసి పాల్గొంటున్నామని చెప్పారు. అదే సమయంలో ఆయన చెబుతున్న అసత్య ప్రచారాలను సహించలేకున్నానని చెప్పారు. ఒకే దేశం... ఒకే ఎన్నిక, ఒకే ఆహారం అంటూ భారత ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగం ధర్మాసనానికి సరిపడని నిరంకుశత్వ ధోరణికి వత్తాసు పలికేలా బీజేపీ సిద్ధాంతాలు ఉండటం వల్ల ఆ పార్టీని, ఆ పార్టీకి చెందిన ప్రధాని మోదీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని స్టాలిన్ వివరణ ఇచ్చారు.

ఇంటింటా స్టాలిన్ ప్రచారం...

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ఇప్పటి వరకూ 16 బహిరంగ సభల్లో 36 నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులకు మద్దతుగా 16 బహిరంగసభల్లో, రోడ్‌షోలలో పాల్గొన్న డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాజధాని నగరం చెన్నైలోని మూడు నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఆ మేరకు మంగళవారం ఉదయం వ్యాన్‌లో ప్రచారాన్ని ప్రారంభించారు. ఉత్తర చెన్నై లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న కొళత్తూరు జీకేఎం కాలనీకి మంగళవారం ఉదయం చేరుకున్నారు. పార్టీ అభ్యర్థి డాక్టర్ కళానిధి వీరాసామిని వెంటబెట్టుకుని ప్రచారం చేశారు. ఓట్లవేట కోసం స్టాలిన్ వస్తున్నట్లు ముందుగా తెలుసుకున్న ఆ కాలనీవాసులు తమ ఇళ్ల ముంగిట్లలో ఆయనకు స్వాగతం పలుకుతూ రంగవల్లులు తీర్చిదిద్దారు. ఇళ్ల గేట్ల వద్ద మహిళలు స్టాలిన్‌ను చూడటానికి వేచి ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న స్టాలిన్ వ్యాన్ నుంచి కిందకు దిగి ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలను పంచిపెట్టి ఉదయించే సూర్యుడి గుర్తుకు ఓటేయమని అభ్యర్థించారు. ఆటుపిమ్మట వ్యాన్‌లో ప్రచారం చేశారు. స్టాలిన్ తెలుపు చొక్కా తెల్ల ప్యాంట్ ధరించి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ఎన్నికలు అత్యంత కీలకమైనవని, గత పదేళ్లుగా దేశాభివృద్ధిని పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థల అధినేతలకు కొమ్ముకాచిన బీజేపీకి మళ్లీ అధికారం కట్టబడితే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదన్నారు. రాజ్యాంగానికి బదులుగా ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలు ఆచరించమంటూ ప్రజలపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపిస్తేనే దేశం బాగుపడుతుందని, యువకులకు ఉద్యోగాలు వస్తాయని ఆయన చెప్పారు. ఐసీఎఫ్ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా నిలిచిన మహిళల వద్దకు వెళ్లి కలైంజర్ సాధికారిక నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యిందా అని అడిగారు. వారిలో చాలా మంది సోమవారమే తమ ఖాతాల్లో నగదు జమ అయ్యిందని బదులిచ్చారు. ఎన్నికల తర్వాత మళ్లీ అర్హులైన గృహిణులకు ఆ పథకాన్ని విస్తరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇక స్థానిక యువతీయువకులు స్టాలిన్‌తో సెల్ఫీలు తీసుకున్నారు. అక్కడి నుంచి మళ్లీ వ్యాన్‌పై ప్రచారం కొనసాగించారు. జీకేఎం కాలనీలోని 32 వీధుల్లో ఆయన ప్రచారం చేశారు. స్టాలిన్‌తోపాటు మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియ, రాజ్యసభ సభ్యుడు గిరిజరాజన్, మాజీ ఎమ్మెల్యే పి.రంగనాథన్ తదితరులు ప్రచార పర్యటనలో పాల్గొన్నారు.

ప్రసార మాధ్యమాలను బెదిరించి సానుకూల సర్వేలు

● బీజేపీ, డీఎంకే కూటములపై ఎడప్పాడి ధ్వజం



పురుషవాక్కం బహిరంగ సభలో మాట్లాడుతున్న పళనిస్వామి

ప్యారీస్, ఏప్రిల్ 16: కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ, డీఎంకేలు ప్రసార మాధ్యమాలను బెదిరించి తమకు అనుకూలంగా సర్వేలు వచ్చేలా ప్రజలను నమ్మిస్తున్నాయని, ఈ ఎన్నికల్లో గెలుపొందబోయేది అన్నాడీఎంకేయేనని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అన్నారు. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో జాతీయస్థాయిలో బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని పలు సంస్థల సర్వేలు వెల్లడిస్తున్నాయి. అదే సమయంలో తమిళనాడులోని 39 పార్లమెంటు స్థానాల్లో డీఎంకే నేతృత్వంలోని ఇండియా కూటమి గెలుస్తుందని ఏబీసీ-సి ఓటర్ సర్వేలో వెల్లడైంది. ఈ సర్వేలపై ఈపీఎస్ స్పందించారు. స్థానిక పురుషవాక్కంలో సెంట్రల్ చెన్నై డీఎండీకే అభ్యర్థి పార్థసారథికి మద్దతుగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సోషల్ మీడియాను తన గుప్పెట్లో ఉంచుకొని తనకు అనుకూలంగా సర్వే ఫలితాలు వెల్లడిస్తోందన్నారు. అదే తరహాలో డీఎంకే కూడా అధికారం చేతిలో ఉందన్న భ్రమతో సర్వేల పేరుతో నాటకమాడుతోందని విమర్శించారు. ఓటర్ల మనోభావాలు అర్థం చేసుకోని ఇలాంటి బూటకపు సర్వేలను నమ్మరాదని, రాష్ట్రానికి మేలు చేసే పార్టీ, అలాగే, హక్కులను సంరక్షించే పార్టీ ఏదో ఒకసారి ఆలోచించి ఓటెయ్యాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రప్రజలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లే చివరి నిమిషం వరకు ఎవరికి ఓటు వేయాలనే నిర్ణయం తీసుకోరని, వాస్తవం చెప్పాలంటే సర్వేల గురించి కూడా పట్టించుకోరని పళనిస్వామి తెలిపారు.



ప్రచార సభలో ప్రసంగిస్తున్న అన్నామలై

మూడో ప్రపంచ యుద్ధం రాకుండా అడ్డుకునేది మోదీ మాత్రమే

బీజేపీ అధ్యక్షుడు అన్నామలై

పెరంబూర్, ఏప్రిల్ 16: మూడో ప్రపంచ యుద్ధం రాకుండా అడ్డుకొనేది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాత్రమేనని కోయంబత్తూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సూలూరులో ఆయన మాట్లాడుతూ.. రష్యా - ఉక్రెయిన్ యుద్ధం ఇంకా ఆగలేదన్నారు. అంతకుముందు సిరియాపై జరిపిన దాడిలో ఇరాన్ అధికారులు మృతి చెందారని తెలిపారు. ప్రస్తుతం ఇరాన్ - ఇజ్రాయిల్ మధ్య ప్రత్యక్ష యుద్ధం జరుగుతోందన్నారు. ఈ యుద్ధం సమయాల్లో భారత్ నాయకత్వం మరింత పటిష్టంగా ఉండాలన్నారు. దేశ రక్షణ, సార్వభౌమ్యాధికారాన్ని రక్షించేందుకు 2024లో ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టడం అత్యంత అవసరమని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధమేఘాలు కమ్ముకున్న సమయంలో దేశ భద్రత మోదీ ఒక్కడి వల్లే సాధ్యమని దేశప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. కఠిన పరిస్థితుల్లో పదేళ్లుగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు మోదీ కృషి చేశారని తెలిపారు. ప్రపంచ నేతలందరితో మాట్లాడే అవకాశం ఒక్క మోదీకే ఉందని అన్నామలై చెప్పుకొచ్చారు.

సమాచార ధ్వని

నేడు పంచవటి క్షేత్రంలో శ్రీరామ నవమి వేడుకలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 16: దిండివనం - పుదుచ్చేరి రహదారిలో తిరుపతిగా పిలువబడే పంచవటి క్షేత్రంలో శ్రీరామ నవమి వేడుకలు బుధవారం జరగనున్నాయి. ఈ సందర్భంగా పూర్వాంగ పూజలు ఈనెల 13వ తేది ప్రారంభమయ్యాయి. బుధవారం వరకు యాగ శాల, హోమాలు, ఏడు జాముల పూజలు నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో లక్షార్చన జరగనుంది. బుధవారం ఉదయం జరిగే రామ నవమి వేడుకల్లో 36 అడుగుల విశ్వరూప జయమంగళ పంచముఖ ఆంజనేయస్వామికి 2,000 లీటర్ల పాలు, పన్నీరు, చందన మిశ్రమాలతో అభిషేకం జరగనుంది. మధ్యాహ్నం 12.30 గంటలకు విశేష తిరుమంజనం, అలంకరణ, పుష్ప వృష్టి తిరువారాధన, తీర్థ ప్రసాదాల పంపిణీ జరుగుతాయి. సాయంత్రం 4.30 గంటలకు సీతారాముల కల్యాణం, నాదస్వరం, సంగీత కచ్చేరీలు నిర్వహిస్తారు.

ఉదయం 11 గంటల్లోపు టీకాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 16: ఆరోగ్య కేంద్రాల్లో టీకాలు వేసే పనులు ఉదయం 11 గంటల్లోపు పూర్తిచేయాలని ఆరోగ్య శాఖ డైరెక్టర్ సెల్వవినాయగం వైద్యులకు సూచించారు. వేసవిలో వ్యాపించే వ్యాధులను దృష్టిలో పెట్టుకొని అన్ని జిల్లాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నగర ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. మందులు పాడవకుండా ఉండాలంటే గది గోడలకు కాస్త దూరంగా నిల్వ చేయాలని సూచించారు.

పెరిగిన పవన విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, ఏప్రిల్ 16: రాష్ట్రంలో పవన విద్యుదుత్పత్తి కోటి యూనిట్లకు పెరిగింది. రాష్ట్రంలో ప్రైవేటు సంస్థలు 10,603 మెగావాట్ల సామర్థ్యంతో విండ్ మిల్లులు ఏర్పాటు చేశారు. మే నుంచి సెప్టెంబరు వరకు ఉన్న సీజన్‌లో లభించే విద్యుత్‌లో 60 శాతం ప్రైవేటు సంస్థలు వినియోగించుకొని మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ బోర్డుకు విక్రయిస్తున్నాయి. సీజన్‌లో ప్రతిరోజు సుమారు 10 కోట్ల యూనిట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. మే నుంచి సీజన్ ప్రారంభం కానుంది.

నేటినుంచి ఎన్నికల ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని బుధవారం నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో చెన్నై నుంచి ప్రతిరోజు నడిపే 2,092 బస్సులతో పాటు 7,154 బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి 3,060 బస్సులు అని రెండు రోజులు 10,214 బస్సులు నడపనున్నామని తెలిపారు. పోలింగ్ నుంచి చెన్నైకి వచ్చే వారి సౌకర్యార్థం 20,21 తేదీల్లో సరిపడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని అధికారులు తెలిపారు.

మోడల్ స్కూళ్లలో అడ్మిషన్ల పెంపునకు చర్యలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 16: ప్రైవేటు పాఠశాలలాగే ప్రభుత్వ మోడల్ స్కూళ్లలో 'మార్కెటింగ్' ఫార్ములా ఆధారంగా విద్యార్థులను చేర్చుకొనేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థులకు ప్లస్ వన్, ప్లస్ టూకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా ప్రైవేటు పాఠశాలల్లో బస, భోజన సౌకర్యంతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విధానాన్ని అనుసరిస్తూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. తల్లిదండ్రులను సంప్రదించి విద్యార్థుల సంఖ్య పెంచేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ పథకంలో చేరే విద్యార్థులకు ప్లస్‌వన్, ప్లస్‌టూ తరగతులు మాత్రమే కాకుండా నీట్, జేఈఈ వంటి ప్రవేశ పరీక్షలకు ఉచితంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామని అధికారులు తెలిపారు.

22 నుంచి ఉచిత విద్య దరఖాస్తుల స్వీకరణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 16: ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు నర్సరీ, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల చేరికకు ఈనెల 22వ తేది నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. ఈ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లను విద్యార్థులకు కేటాయిస్తున్నారు. చెన్నై జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎల్కేజీ, 1వ తరగతి అడ్మిషన్లకు ఈనెల 22 నుంచి మే 20వ తేది వరకు www.rte.tnschools.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చు. అదనపు దరఖాస్తులు వస్తే మే 28వ తేది డ్రా ద్వారా సీట్లు కేటాయించనున్నట్లు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు.

పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 16: మద్రాసు విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. ఈ విశ్వవిద్యాలయ మెరీనా, గిండి ప్రాంగణాల్లో వివిధ శాఖల్లో పీజీ కోర్సుల అడ్మిషన్లు జరుగుతున్నాయి. విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిచేసి తగిన సర్టిఫికేట్లతో సమర్పించాలని అధికారులు తెలిపారు.

వేసవి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 16: వేసవి సెలవుల్లో ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

● నెం.06001 తాంబరం - కన్నియాకుమారి సూపర్ ఫాస్ట్ స్పెషల్ ఈనెల 18, 20 (గురు, శనివారాలు) తేదీల్లో తాంబరం నుంచి సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి మరసటిరోజు తెల్లవారుజామున 4.40 గంటలకు కన్నియాకుమారి చేరుకుంటుంది. నెం.06002 కన్నియాకుమారి - తాంబరం సూపర్ ఫాస్ట్ స్పెషల్ ఈనెల 19, 21 (శుక్ర, ఆదివారాలు) తేదీల్లో కన్నియాకుమారి నుంచి రాత్రి 8.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

● నెం.06003 ఎగ్మూర్ - కోయంబత్తూర్ ప్రత్యేక రైలు ఈనెల 18, 20 (గురు, శనివారాలు) తేదీల్లో ఎగ్మూర్ నుంచి సాయంత్రం 4.25 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.20 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది. నెం.06004 కోయంబత్తూర్ - ఎగ్మూర్ ప్రత్యేక రైలు ఈ నెల 19, 21 (శుక్ర, ఆదివారాలు) తేదీల్లో రాత్రి 8.40 గంటలకు కోయంబత్తూర్ నుంచి బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.05 గంటలకు ఎగ్మూర్ చేరుకుంటుంది.

పాక్షిక రద్దు...

అరక్కోణం రైల్వే యార్డులో ట్రాక్ మరమ్మతుల కారణంగా కోయంబత్తూర్ - చెన్నై - కోయంబత్తూర్ రైళ్ల సేవల్లో మార్పులు చేపట్టారు. ఆ ప్రకారం, కోవై నుంచి ఉదయం 6.20 గంటలకు బయల్దేరే ఇంటర్ సిటీ రైలు ఈ నెల 17, 24, 39 తేదీల్లో చెన్నై సెంట్రల్‌కు బదులుగా కాట్పాడి వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే, చెన్నై - కోవై ఇంటర్ సిటీ ఈ నెల 17, 24, 30 తేదీల్లో చెన్నై సెంట్రల్‌కు బదులుగా కాట్పాడి నుంచి బయల్దేరుతుంది.

పేద విద్యార్థులకు ఉచిత ఫుట్‌బాల్ శిక్షణ

వేల్స్ వర్సిటీ ఛాన్సలర్ ఐసిరి గణేశ్ ● అంతర్జాతీయ ప్రచారకర్తగా గైజ్కా టోక్వెరో



ఇంటర్నేషనల్ బ్రాండ్ అంబాసిడర్ గైజ్కా టోక్వెరోను పరిచయం చేస్తున్న వేల్స్ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ ఐసిరి కె.గణేశ్ తదితరులు

అడయార్, ఏప్రిల్ 16: నగరంలోని ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన వేల్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఐసిరి కె.గణేశ్ పేద విద్యార్థులకు ఫుట్‌బాల్ క్రీడలో ఉచిత శిక్షణ ఇప్పించనున్నారు. ఇందుకోసం వేల్స్ ఫుట్‌బాల్ క్లబ్‌తో ప్యూమా అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అలాగే ఈ ఫుట్‌బాల్ క్లబ్‌కు అంతర్జాతీయ బ్రాండ్ అంబాసిడర్‌గా అథ్లెటిక్ బిల్‌బో మాజీ స్ట్రైకర్ గైజ్కా టోక్వెరో వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని మంగళవారం చెన్నైలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సామాజిక కార్యకర్తగా, విద్యావేత్తగా, చలనచిత్ర నిర్మాతగా, వ్యాపారవేత్తగా, క్రీడా ఔత్సాహికుడిగా ఇలా అనేక పాత్రలను పోషిస్తున్న ఐసిరి కె. గణేశ్ తన ఫుట్‌బాల్ క్లబ్ తరపున సమాజంలోని పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రముఖ స్పోర్ట్స్‌వేర్ బ్రాండ్ ప్యూమాతో ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన కోచింగ్, సౌకర్యాలు కల్పించడం, శిక్షణ, క్రీడా పోటీలకు అవసరమైన సామగ్రిని అందించనున్నారు. ఈ శిక్షణ విద్యార్థుల్లో శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తూ, వారి ప్రతిభను వెలికితీసే విధంగా ఉంటుందని విలేకరుల సమావేశంలో ఐసిరి కె.గణేశ్ వెల్లడించారు. ఇందుకోసం అర్హులైన విద్యార్థులను స్థానిక పాఠశాలలు, కమ్యూనిటీ సంస్థలు, ఎన్జీవో సంస్థల సహకారంతో ఎంపిక చేస్తామన్నారు. 2024-25 సీజన్‌లో పోటీ పడేందుకు మొదటి లీగ్ పోటీల కోసం జట్టును రూపొందించే ప్రయత్నాల్లో భాగంగా తమ ఫుట్‌బాల్ క్లబ్ అంతర్జాతీయ సహకారాన్ని తీసుకుంటున్నట్టు ప్రకటించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.

సెంగోల్ సమర్పణకు వితంతువు అనర్హురాలా?

హైకోర్టు ఆగ్రహం ● పిటిషన్ తోసివేత

పెరంబూర్, ఏప్రిల్ 16: మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ వేడుకల్లో భర్త చనిపోయిన మహిళకు సెంగోల్ సమర్పించకుండా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు మదురై బెంచ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మదురై మీనాక్షి ఆలయంలో ప్రస్తుతం చిత్తిరై ఉత్సవాలు ధ్వజారోహరణంతో ప్రారంభమై కోలాహలంగా జరుగుతున్నాయి. ఆ వేడుకల్లో మీనాక్షి అమ్మవారి పట్టాభిషేకం సందర్భంగా ఆలయ ట్రస్టు బోర్డు అధ్యక్షుడు సెంగోల్ సమర్పించడం ఆనవాయితీ. అయితే ప్రస్తుతం బోర్డు అధ్యక్షుడు రుక్మిణి పళనివేల్ త్యాగరాజన్ వితంతువుగా ఉండటంతో అమ్మవారికి సెంగోల్ సమర్పించకుండా ఉత్తర్వులివ్వాలని దినకరన్ అనే వ్యక్తి పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణ రాగా న్యాయమూర్తి శరవణన్ పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ వేడుకల్లో వితంతువు సెంగోల్ ఇవ్వరాదని ఆగమ శాస్త్రంలో పేర్కొన్నారా? అంటూ ప్రశ్నించారు. అమ్మవారికి సెంగోల్ సమర్పించేది హిందువులే కదా, అలాంటప్పుడు ఈ అభ్యంతరం సమంజసమేనా అంటూ ప్రశ్నించిన న్యాయమూర్తి, ప్రస్తుత ఆధునిక యుగంలో ఇలాంటి పిటిషనేన్లు వేయడం గర్హనీయమని పేర్కొన్నారు. చిత్తిరై ఉత్సవాలు ప్రారంభించిన తర్వాత పిటిషన్ దాఖలు చేయడం భావ్యం కాదని పిటిషన్ తోసిపుచ్చుతూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ తరపు న్యాయవాది గతంలో ఈ రకం కేసులో ద్విసభ్య ధర్మాసనం పిటిసన్‌ను తోసిపుచ్చిన విషయాన్ని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. ఆ వాదనతో ఏకీభవిస్తున్నట్లు ప్రకటించిన న్యాయమూర్తి పిటిషన్‌ను తోసిపుచ్చారు.


సీతారాములుకు శాస్త్రోక్తంగా అభిషేకం



అభిషేక, అలంకరణ పూజల్లో నిర్వాహకులు

ప్యారీస్, ఏప్రిల్ 16: స్థానిక జార్జిటౌన్‌లోని మద్రాసు మిర్చి వర్తక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సీతారాములుకు శాస్త్రోక్తంగా అభిషేక, అలంకరణలు నిర్వహించారు. రామనవమి వేడుకల సందర్భంగా రామకృష్ణ వీధిలో ఉన్న సంఘ భవనంలో సీతారాములును రకరకాల పూలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించి అర్చనాది పూజలను నిర్వహించారు. ఉదయం 8.30 నుంచి 10.30 గంటల్లోపు సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను పాలు, పెరుగు, నారికేళ జలం, పన్నీరు, గంధంతో అభిషేకించారు. ఈ ప్రత్యేక పూజల్లో సంఘ అధ్యక్షుడు మిరియాల మాధవయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ వి.ధనుంజయ నాయుడు, నిర్వాహకులు ఎస్.భాస్కర్, ఎస్.శివకుమార్, ఎస్.సురేష్, ఎస్కే హిమామ్ బాషా, ఎ.రాంబాబు, ఎస్.బాలసుబ్రమణ్యం, ఎ.ప్రభాకరన్, ఎన్.జనార్దన్, ఎస్.శ్రీనివాసులు, పి.గిరిధర్, మూర్తి చెన్నకేశవులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం 9.45-11.45 గంటల మధ్య ఆదియప్పన్ నాయకన్ వీధిలో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి కన్వెన్షన్ హాలులో సీతారాముల కల్యాణోత్సవం జరగనుంది.

కొడైకెనాల్‌లో అధికమైన పర్యాటకుల రద్దీ



కొడైకెనాల్ స్టార్ సరస్సు వద్ద బోట్ సవారీ చేస్తున్న పర్యాటకులు

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో వారం రోజులుగా పర్యాటలకు రద్దీ పెరిగింది. ఓ వైపు భగ్గుమంటున్న భానుడు, మరో వైపు స్కూళ్లు, కాలేజీలకు సెలవులు రావటంతో దేశం నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. స్టార్ సరస్సు వద్ద పర్యాటకులు బోట్ సవారీకి బారులు తీరుతున్నారు. అదే విధంగా ఉద్యాన వనాల్లో పర్యాటకులు సందడి చేస్తున్నారు. ఆదివారం నుంచి పర్యాటకుల రాక పెరిగిందని స్టార్ సరస్సు బోట్‌హౌస్ నిర్వాహకులు తెలిపారు.

రోజ్ మిల్క్, ఐస్‌క్రీంతో రుమాటిక్ ఫీవర్ వ్యాప్తి

ఐసిఎఫ్, ఏప్రిల్ 16: రోజ్ మిల్క్, ఐస్ క్రీం ద్వారా రుమాటిక్ ఫీవర్ వ్యాపిస్తున్నట్లు డాక్టర్ కుళందైస్వామి తెలిపారు. వేసవిలో శీతల పానీయాలు, ఐస్‌క్రీంలు వంటి తీసుకోవడం ఆనవాయితీ. వీటిలో రోజ్ మిల్క్, ఐస్‌క్రీం తీసుకొనే వారికి గుండె, మోకాళ్లు, చర్మం, మెదడుపై ప్రభావం చూపే జ్వరం వచ్చే అవకాశాలున్నాయని, ముఖ్యంగా పిల్లల్లో గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

మిల్క్ షేక్‌లో బల్లి

● హోటల్‌కు జరిమానా

ఐసిఎఫ్, ఏప్రిల్ 16: మిల్క్ షేక్‌లో బల్లి ఉన్నట్లు అందిన ఫిర్యాదుల మేరకు ఆహార భద్రతా శాఖ అధికారులు విచారణ జరిపి హోటల్‌కు జరిమానా విధించారు. స్థానిక అన్నానగర్ 4వ అవెన్యూలో ఉన్న అక్షయం హోటల్‌లో ఆదివారం రాత్రి పిల్లలతో వచ్చిన ఓ కుటుంబం మిల్క్ షేక్ ఆర్డరు ఇచ్చారు. అందులో బల్లి ఉండడాన్ని గుర్తించి హోటల్ ఉద్యోగిని నిలదీశారు. హోటల్ యజమాని నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అన్నానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న ఆహార భద్రతా శాఖ అధికారులు హోటల్‌లో తనిఖీలు నిర్వహించి, రూ.1,000 జరిమానా విధించి నోటీసు అందజేశారు.

తమిళ సంవత్సరాది శుభాకాంక్షలు ముద్రించలేదు

● ఆవిన్

ఐసిఎఫ్, ఏప్రిల్ 16: ఆవిన్ పాల ప్యాకెట్లపై తమిళ సంవత్సరాది శుభాకాంక్షల ప్రకటనను ఇప్పటివరకు ముద్రించలేదని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ తెలిపారు. ఆవిన్ సంస్థ వినియోగదారులకు పండుగలకు శుభాకాంక్షలు తెలియజేసేలా పాల ప్యాకెట్లపై శుభాకాంక్షలు ముద్రిస్తోంది. ఈ విధానం పలు సంవత్సరాలుగా కొనసాగుతోంది. దీనిపై విమర్శలు తలెత్తడంతో ఈ సారి పాల ప్యాకెట్లపై తమిళ సంవత్సరాది శుభాకాంక్షలు ముద్రించలేదు. ఈ విషయమై సంస్థ ఎండీ వినీత్ మాట్లాడుతూ... అన్ని పండుగలకు శుభాకాంక్షలు ముద్రించినప్పటికీ, ఇప్పటివరకు తమిళ సంవత్సరాదిని పురస్కరించుకొని శుభాకాంక్షలు ముద్రించలేదని, వచ్చే ఏడాది కూడా ముద్రించబోమని తెలిపారు.

ఎన్నికలు బహిష్కరించనున్న 'టెట్' ఉత్తీర్ణులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 16: 'టెట్' ఉత్తీర్ణులైన వారు లోక్‌సభ ఎన్నికలు బహిష్కరించాలని నిర్ణయించారు. 2013లో టెట్ ఉత్తీర్ణులైన 20,000 మందికి ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు శాసనసభ ఎన్నికల సమయంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. అనంతరం ఎన్నికల హామీ విస్మరించారు. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ గత ఏడాది అక్టోబరులో పాఠశాల విద్యా శాఖ మంత్రి ఇంటిని ముట్టడించి ఆందోళన చేపట్టారు. 50 శాతం సీనియారిటీ ఆధారంగా, 50 శాతం మంది అర్హత పరీక్ష ద్వారా నియమించనున్నట్లు మంత్రులు, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంతో ఆగ్రహించిన టెట్ ఉత్తీర్ణులైన ఉపాధ్యాయులు లోక్‌సభ ఎన్నికలు బహిష్కరించాలని నిర్ణయించారు.

హనుమంత వాహనంపై కళ్యాణ రామన్న అభయం



హనుమంత వాహనంపై విహరిస్తున్న రామయ్య

ప్యారీస్, ఏప్రిల్ 16: స్థానిక కొడుంగయూరు, తిరువళ్లువర్ నగర్‌లోని శ్రీ సీతారామ కళ్యాణ సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరో వార్షిక శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులోభాగంగా, హనుమంత వాహనంపై కళ్యాణ రామచంద్రుడు భక్తులకు అభయమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో తనకిష్టమైన హనుమంత వాహనంపై మంగళవారం సాయంత్రం విహరించిన శ్రీరామచంద్రమూర్తి ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, సన్నాయిమేళం, జైశ్రీరామ్ నామస్మరణల మధ్య ఊరేగింపు వివేకానంద నగర్, సంజయ్ గాంధీ వీధి, కన్నదాసన్ నగర్ మీదుగా వీనులవిందుగా సాగింది. కైంకర్య దాతలైన మొలగనూరు విజయకుమార్, సురేఖ దంపతులు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా, బుధవారం రాత్రి 8గంటలకు కన్నదాసన్ నగర్ 60 అడుగుల రోడ్డు కాళికాంబాల్ ఆలయ సమీపంలో సీతారాముల కల్యాణం జరగనుండగా, కన్యాదాతలుగా విజయకుమార్, సురేఖ దంపతులు వ్యవహరించనున్నారు. గురువారం ఉదయం 9 గంటలకు శ్రీరామ పట్టాభిషేకం సందర్భంగా రామయ్యకు చక్రవర్తి అలంకార ముత్తంగి సేవ నిర్వహించనున్నట్టు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.

అన్నాడీఎంకే ఎమ్మెల్యే పొల్లాచ్చి జయరామన్‌కు అస్వస్థత



చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి నియోజకవర్గం శాసనసభ్యుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్ తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పదిహేను రోజులుగా ఆయన లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన ప్రచారం చేస్తూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనకు ప్రాథమిక చికిత్సలందించి కోయంబత్తూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆయనను పరీక్షించి వడదెబ్బ కారణంగా అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. సోమవారం రాత్రి ఆసుపత్రిలో చికిత్సలందుకున్న తర్వాత ఆయన కోలుకున్నారని పార్టీ పేర్కొంది.

బస్టాండు విస్తరణ పనులు ఆపండి

● ఉసిలంపట్టిలో దుకాణాల బంద్



ఉసిలంపట్టి బస్టాండు ప్రాంతంలో మూతపడిన దుకాణాలు

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తేని మెయిన్ రోడ్డులో ఉన్న ఉసిలంపట్టి బస్టాండు విస్తరణ పనులను నిలిపివేయాలంటూ బస్టాండు చుట్టూ ఉన్న దుకాణాల వ్యాపారులు మం గళవారం ఉదయం బంద్ పాటించారు. బస్టాండు విస్తరణ పనుల కు గాను తమ దుకాణాలను కూ ల్చేందుకు మున్సిపాలిటీ అధికారు లు ప్రయత్నించడంతో వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై వ్యాపారుల సంఘం నాయకులు మాట్లాడుతూ తమకు ప్రత్యామ్నాయ దుకాణాలు గానీ, లేదా అనువైన ప్రాంతాలను గానీ కేటాయించకుండా దుకాణాలను ఖాళీ చేసి వెళ్లమని మున్సిపాలిటీ అధికారులు బెదరిస్తుండటం భావ్యం కాదన్నారు. అధికారులు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా దుకాణాలను కూల్చివేసేందుకు ప్రయత్నించడంతో వ్యాపారులంతా దుకాణాలు మూసి వేసి బంద్ పాటించినట్లు తెలిపారు.

క్రెడాయ్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ అలీ



అడయార్, ఏప్రిల్ 16: క్రెడాయ్ చెన్నై చాప్టర్‌కు 2024-26 సంవత్సరానికి ప్రెసిడెంట్‌గా సౌత్ ఇండియా షెల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టరుగా మహ్మద్ అలీ నియమితులయ్యారు. ఈ ఎంపిక కార్యక్రమంలో క్రెడాయ్ జాతీయ పూర్వ చైర్మన్ ఇర్ఫాన్ రజాక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలాగే, టీఎన్ఆర్ఈఆర్ఏ మెంబర్, చైర్‌పర్సన్ సునీల్ కుమార్ (రిటైర్డ్ ఐపీఎస్), క్రెడాయ్ నేషనల్ ఎలెక్ట్ ప్రెసిడెంట్ శేఖర్ జి.పటేల్ పాల్గొన్నారు. మొహ్మద్ అలీ బృందంలో ఆఫీస్ బేరర్లుగా మొహెల్ హెచ్ దోసి, అస్లం ఫకీర్ మహ్మద్, విశ్వజిత్ కుమార్, సుమన్ వోరా, ఎం.అరుముగం, పి.కృతివాస్, రంజీత్ రాథోడ్, కె.మోతీష్ కుమార్, టి.అరుల్, ఎస్.ఎస్. ప్రసాద్ బాబు ఉన్నారు.మొహ్మద్ అలీ మాట్లాడుతూ... పూర్వీకులు నెలకొల్పిన ఈ సంస్థ సమగ్రతను, వారసత్వాన్ని కొనసాగించేందుకు, కాపాడేందుకు కృషి చేస్తానని, ఈ బాధ్యతలను స్వీకరించడం గౌరవంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు.



వేలూరు కార్పొరేషన్ పరిధిలోని సున్నాంబుకార వీధి, పెరిమాళ్ నగర్ ప్రాంతాల్లో మంగళవారం డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్‌కు మద్దతుగా ప్రచారంలో ఆ పార్టీ శ్రేణులు

నెల్లై నియోజకవర్గ ఎన్నిక ఆపలేం

● మద్రాసు హైకోర్టు

ప్యారీస్, ఏప్రిల్ 16: తిరునెల్వేలి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నిక నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను తోసిపుచ్చుతూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తిరునెల్వేలి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ నామినేషన్‌ను అంగీకరించడాన్ని వ్యతిరేకిస్తూ మదురైకి చెందిన న్యాయవాది మహారాజన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నయినార్ నాగేంద్రన్ నామినేషన్ పత్రాల్లో పూర్తిస్థాయి సమాచారం లేదని, ఆస్తులకు సంబంధించిన వివరాలు సమర్పించలేదని పిటిషనర్ న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గంగాపూర్‌వాలా, న్యాయమూర్తి సత్యనారాయణతో కూడిన ప్రథమ ధర్మాసనం సమక్షంలో మంగళవారం ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. ఇరుతరపు న్యాయవాదుల వాదనల అనంతరం, ప్రస్తుతం పోలింగ్ మినహాయించి ఎన్నికలకు సంబంధించిన అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయని, అందువల్ల ఆలస్యంగా దాఖలు చేసిన ఈ పిటిషన్ విచారణకు ఆమోదయోగ్యం కాదని, ఒకవేళ పిటిషనర్ నష్టపోతే ఎన్నికల అనంతరం కేసు దాఖలు చేయవచ్చన్నారు.

వెయ్యి టీషర్టుల స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న టీషర్టులు

వేలూరు, ఏప్రిల్ 16: ఆనైకట్టు శాసనసభ నియోజకవర్గంలో మంగళవారం ఉదయం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. కందనేరి జంక్షన్ రోడ్డులో చేపట్టిన తనిఖీల్లో, ఎలాంటి ఆధారాలు లేకుండా వాహనంలో తరలిస్తున్న రూ.30 వేల విలువైన రాజకీయపార్టీల గుర్తులతో ఉన్న వెయ్యి టీషర్టులను స్వాధీనం చేసుకున్నారు.

రాయపురంలో రూ.3.88 లక్షల స్వాధీనం

ప్యారీస్, ఏప్రిల్ 16: ఉత్తర చెన్నై పరిధిలోని రాయపురంలో వాహనతనిఖీలు చేపట్టిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు రసీదు లేకుండా తరలిస్తున్న రూ.3.88 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. రాయపురం ఎన్నార్టీ ఫ్లైఓవర్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున తనిఖీల్లో పాల్గొన్న అధికారులు, అటుగా వచ్చిన కారును ఆపి తనిఖీ చేశారు. అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ నడుపుతున్న కార్యాలయానికి నగదు తీసుకెళ్తున్నట్టు డ్రైవర్ తెలిపాడు. అయితే మసీదులు లేకపోవడంతో ఆ నగదు స్వాధీనం చేసుకొని ప్రభుత్వ ట్రెజరీకి అప్పగించారు.

షటిల్ ఆడుతూ బీజేపీ అభ్యర్థి ప్రచారం



షటిల్‌కాక్ ఆడుతున్న బీజేపీ అభ్యర్థి షణ్ముగం

వేలూరు, ఏప్రిల్ 16: వేలూరు లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగం విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. మంగళవారం కోట మైదానం వద్దకు వెళ్లిన షణ్ముగం, ఆ సమయంలో కొందరు షటిల్ కాక్ ఆడుతుండగా, వారి వద్దకు వెళ్లి రాకెట్ తీసుకొని కొద్దిసేపు షటిల్ కాక్ ఆడారు. అనంతరం మైదానంలో వాకింగ్ చేస్తున్న వారికి కరపత్రాలు అందజేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఆయన వెంట పుదియ నీతి పార్టీ నాయకులు జీపీకే బాలాజి, మండీ జయప్రకాశ్, కార్యకర్తలున్నారు.

కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పండి

● పొల్లాచ్చి సభలో కమలహాసన్

ప్యారీస్, ఏప్రిల్ 16: రైతులను శత్రువులుగా భావిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఈ పార్లమెంటు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమల్ 'రాష్ట్రప్రజలకు పిలుపునిచ్చారు. కోవై డీఎంకే అభ్యర్థి ఈశ్వరస్వామికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న కమల్ మాట్లాడుతూ... సుపరిపాలన అందిస్తున్న డీఎంకే ద్రావిడ మోడల్ గురించి ఎవరూ హేళన చేయరాదని, ఉచిత కరెంట్, వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్, 2 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లను డీఎంకే ప్రభుత్వం అందజేసిందన్నారు. అయితే, కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో కొనసాగుతున్న ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు మొండిచెయ్యి చూపిందని కమల్ ధ్వజమెత్తారు.

జూమ్ మీటింగ్‌లో బీజేపీ అభ్యర్థి తమిళిసై

● ప్రత్యక్షమైన అశ్లీల వీడియో

అడయార్, ఏప్రిల్ 16: జూమ్ మీటింగ్‌లో బీజేపీ సౌత్ చెన్నై అభ్యర్థి తమిళిసై సౌందర్ రాజన్ పాల్గొని ఉండగా, ఉన్నట్టుండి అశ్లీల వీడియో ప్రత్యక్షమైంది. దీంతో ఆమె దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ అంశంపై ఆమె నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో జూమ్ మీటింగ్‌లో ఆమె బహుళ అంతస్తు భవనాల్లో నివసించే ఓటర్లతో తనకు ఓటు వేసి గెలిపించాలంటూ అభ్యర్థిస్తున్నారు. ఇంతలో అశ్లీల వీడియో తెరపై ప్రత్యక్షమైంది.

ముందస్తు అనుమతి లేకుండా బీజేపీ ప్రచారం

● కేసు నమోదుకు ఈసీ ఆదేశం

అడయార్, ఏప్రిల్ 16:లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముందస్తు అనుమతి లేకుండా పత్రికల్లో ప్రకటనలు ఇచ్చిన ప్రచారం చేసినందుకు భారతీయ జనతా పార్టీ అభ్యర్థులపై కేసు నమోదు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహు ఆదేశించారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఎలాంటి ఆధారాలు లేకుండా పరిమితికి మించి డబ్బులు తరలించిన రూ.1,284.46 కోట్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ మొత్తంలో ఒక్క కాంచీపురం జిల్లాలోనే అత్యధికంగా రూ.950 కోట్ల విలువైన బంగారం ఉందన్నారు. ఈ బంగారానికి సంబంధించి అన్ని ఆధారాలు చూపించడంతో తిరిగి అప్పగించినట్టు తెఇపారు.

మానవ మేధస్సుకు గణితం దోహదం



సావనీర్ ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, ఏప్రిల్ 16: మానవ మేధస్సుకు గణితం తోడ్పడుతుందని వక్తలు పేర్కొన్నారు. వడపళనిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఆధ్వర్యంలో 'గణితంలో వస్తున్న మార్పులు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. సదస్సును మద్రాసు యూనివర్సిటీ డైరెక్టర్, రామానుజం ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్సుడు స్టడీ ఇన్ మ్యాథమెటిక్స్ హెడ్ డాక్టర్ ఎం.పిచ్చిమణి ప్రారంభించారు. ఎస్ఆర్ఎం వర్సిటీ డీన్ డాక్టర్ సీవీ జయకుమార్, మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ సి.రాజేష్ పాల్గొన్నారు. గతంలో గణితం బోధనా విధానం, ప్రస్తుత విధానంలో వస్తున్న మార్పులు, గణిత శాస్త్రంలో వస్తున్న మార్పులపై వక్తలు ప్రసంగించారు. సదస్సులో భాగంగా ముద్రించిన ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించారు.

తిరుప్పూర్ హత్య కేసులో నలుగురికి యావజ్జీవం

ప్యారీస్, ఏప్రిల్ 16: తిరుప్పూర్‌లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని హతమార్చిన నలుగురికి న్యాయస్థానం తలా నాలుగు యావజ్జీవ జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. తిరుప్పూర్ పల్లడం కల్లకినరు ప్రాంతానికి చెందిన మోహన్‌రాజ్ (49), తన భార్య, కుమారుడితో నివసిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం ఆయన హోటల్ సమీపంలో తిరునెల్వేలి జిల్లాకు చెందిన వెంకటేష్ మాంసం దుకాణం నిర్వహించాడు. ఈ నేపథ్యంలో, మోహన్‌రాజ్ తన హోటల్‌ను మరో వ్యక్తికి లీజుకిచ్చాడు. హోటల్‌కు మాంసం సరఫరా చేయడంలో బాకీ చెల్లించని కారణంగా హోటల్‌లో ఉన్న సిలిండర్‌ను వెంకటేష్ తీసుకెళ్లడంతో వారి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఇదిలా ఉండగా, గత ఏడాది సెప్టెంబరు 3వ తేది మోహన్‌రాజ్, ఆయన తల్లి పుష్పవతి (68), సోదరుడు సెంథిల్‌కుమార్ (46), పిన్ని రత్నాంబాళ్ (59)ను గుర్తుతెలియని ముఠా హత్యచేసింది. దర్యాప్తు చేపట్టిన పల్లడం పోలీసులు వెంకటేష్ (27), ఆయన తండ్రి అయ్యప్పన్ (52), చెల్లముత్తు (24), ముత్తయ్యా (20), సెల్వం (29)ని అరెస్ట్ చేశారు. ఏడు నెలల విచారణ పూర్తికావడంతో తిరుప్పూర్ జిల్లా ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి స్వర్ణం నటరాజన్ తీర్పు వెలువరించారు. ముద్దాయిల్లో చెల్లముత్తు మినహాయించి మిగతా నలుగురికి తలా నాలుగు యావజ్జీవ జైలుశిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించారు. నేరస్తులకు ఆశ్రయం కల్పించిన చెల్లముత్తుకు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.



● కూసంత సరదాగా


యువకులతో ఫుట్‌బాల్ ఆడుతున్న సీఎం స్టాలిన్

ప్రచార పర్యటనలో స్టాలిన్ బంతాట

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం ఉదయం లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్యటనలో భాగంగా కొళత్తూరు ఐసీఎఫ్ ప్రాంతాల్లో ఓ క్రీడామైదానంలోకి వెళ్ళి ఫుట్‌బాల్ ఆడి సందడి చేశారు. ఉత్తర చెన్నై డీఎంకే అభ్యర్థి కళానిధి వీరాసామి, మధ్య చెన్నై డీఎంకే అభ్యర్థి దయానిధి మారన్‌కు మద్దతుగా ఆయన ఇంటింటా ప్రచారం జరిపారు. ఓపెన్‌టాప్ వ్యాన్‌పై నిలిచి ఉదయించే సూర్యుడి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. స్టాలిన్ రాక సందర్భంగా ఐసీఎఫ్ తదితర ప్రాంతాల్లో మహిళలు ఇళ్ల ముంగిళ్లలో రంగవల్లులు తీర్చిదిద్దారు. ప్రతి ముగ్గులోనూ సీఎం స్టాలిన్‌కు స్వాగతం అంటూ తమిళంలో రాసిపెట్టారు. ఆ రంగవల్లులను చూస్తూ ఆయన ప్రచారం కొనసాగించారు. అదే సమయంలో ఐసీఎఫ్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో కొంతమంది యువకులు ఫుట్‌బాల్ ఆడుతుండటం చూసి స్టాలిన్ అక్కడి వెళ్లారు. ఆ యువకులతో కబుర్లాడుతూ బంతిని కాలితో తన్నుతూ వారితో కొంతసేపు ఫుట్‌బాల్ ఆడి సందడి చేశారు. స్టాలిన్‌తోపాటు డీఎంకే అభ్యర్థి కళానిధి వీరాసామికి కూడా కాసేపు బంతాట ఆడారు.

● వీఐపీ నియోజకవర్గం

రామనాథపురంలో పాగా వేసేదెవరో?

● బరిలో మాజీ సీఎం ఓపీఎస్

ప్యారీస్, ఏప్రిల్ 16: రాష్ట్రంలోని ప్రధాన పురాతన పుణ్యక్షేత్రాల్లో రామనాథపురం ఒకటి. ఓ వైపు బంగాళాఖాతం, మరోవైపు వ్యవసాయ భూములున్న ఈ ప్రాంతం పర్యాటకానికి ప్రసిద్ధి. రామాయణంతో సంబంధాలున్న రామేశ్వరం, రామనాథస్వామి ఆలయం, అగ్నితీర్థంతో పాటు మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జన్మించిన పుణ్యభూమి. రామనాథపురం ఎన్నికల బరిలో ఈ సారి మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం బీజేపీ కూటమి మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ముస్లిం, క్రైస్తవుల పుణ్యస్థలాలు కూడా ఈ నియోజకవర్గ పరిధిలో కొలువై ఉన్నాయి. ఇక్కడి ప్రజల ప్రధాన వృత్తులు చేపల వేట, వ్యవసాయం, చేనేత. ముక్కులత్తోర్, దేవేంద్ర కులం, వేలాలర్, ముస్లింలు, యాదవులు, నాడార్లు, క్రైస్తవులు ఉన్నారు. ప్రధానంగా దేశంలో మరెక్కడా లేని విధంగా సముద్రంలో అతి పొడవైన పాంబన్ రైలు వంతెన ఇక్కడే ఉండడం విశేషం. ఈ వంతెనను ప్రత్యక్షంగా వీక్షించేందుకు దేశ, విదేశాల నుంచి ప్రతిరోజు పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలివస్తుంటారు.


నవాజ్ ఘనీ (డీఎంకే)


ఓ.పన్నీర్‌సెల్వం (స్వతంత్ర)


జయపెరుమాళ్ (అన్నాడీఎంకే)

1951 నుంచి...

రాష్ట్రంలోని 39 పార్లమెంటు నియోజకవర్గాల్లో రామనాథపురం 35వది. పునర్విభజనకు ముందే 1951 నుంచి ఈ నియోజకవర్గానికి సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. 2008 పునర్విభజన తర్వాత పుదుకోట జిల్లాల్లోని అరంతాంగి, విరుదునగర్ జిల్లాలోని తిరుచ్చూలి, రామనాథపురం జిల్లాలోని పరమకుడి, తిరువాడనై, రామనాథపురం, ముదుగలత్తూర్ తదితర శాసనసభ నియోజకవర్గాలతో రామనాథపురం పార్లమెంటు స్థానం ఆవిర్భవించింది. రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఈ నియోజకవర్గంలో గతంలో కాంగ్రెస్ ఎక్కువ సార్లు గెలుపొందింది. ఆ పార్టీ 1951 నుంచి వరుసగా మూడు సార్లు, ఆ తర్వాత 1984 నుంచి మూడు సార్లు ఎంపీలుగా గెలవడం గమనార్హం. ఇటీవల ప్రాంతీయ పార్టీలు, వాటి కూటమి అభ్యర్థులు సైతం సత్తా చాటుతున్నారు.

మొత్తం ఓటర్లు

గత జనవరి 25వ తేదీన ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటరు జాబితా ప్రకారం రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం 16,06,014 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 7,96,989 మంది కాగా, మహిళలు 8,08,942 మంది, ఇతరులు 83 మంది.

సిట్టింగ్ ఎంపీ పనితీరు...

2019వ సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకే కూటమిలోని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీకి చెందిన నవాజ్ ఘని 'నిచ్చెన' గుర్తుపై పోటీ చేసి తొలిసారిగా గెలుపొందారు. ఆయన పార్లమెంటు సమావేశాల్లో అధికంగా పాల్గొని పలు సమస్యలు పరిష్కరింపజేశారు. 2020లో రైతులకు పంట బీమా వచ్చేలా చేయడంతో పాటు వ్యవసాయ దిగుబడులకు గిట్టుబాటు ధర నిర్ణయించేలా కృషి చేశారు. ప్రధాన పర్యాటక కేంద్రంగా రాణిస్తున్న రామనాథపురంలో ఆగకుండా వెళుతున్న రామేశ్వరం - బెనారస్ వారాంతపు రైలుకు స్టాపింగ్ కల్పించారు. అలాగే, చెన్నై - రామనాథపురం మధ్య విమాన సేవలు ప్రారంభించాలని కేంద్ర విమానయాన శాఖను కోరారు. అంతేకాకుండా స్వతహాగా వ్యాపారవేత్త కావడంతో ఆయన తన సొంత నిధులతో 3,100 మంది విద్యార్థులకు ఉన్నత విద్య చదివేందుకు సాయపడ్డారు. అయినప్పటికీ, నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన తాగునీటి సమస్య పరిష్కరింపజేయలేదని, జాలర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదనే అసంతృప్తి స్థానిక ఓటర్లలో నెలకొంది.

ఓపీఎస్ పోటీతో స్టార్ హోదా...

రామనాథపురం లోక్‌సభ ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీ నవాజ్ ఘనీ రెండవ సారి డీఎంకే కూటమి తరఫున పోటీచేస్తున్నారు. అదే విధంగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా 'పనస పండు' గుర్తుపై మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం బరిలో ఉన్నారు. ఇక, అన్నాడీఎంకే తరఫున జయపెరుమాళ్, మరికొందరు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

● మంత్రి గారి హామీ


మురుగన్‌ను ఆశీర్వదిస్తున్న మహిళా వ్యాపారి

గెలిపిస్తే గ్రామం దత్తత

● కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

ప్యారీస్, ఏప్రిల్ 16: ఎంపీగా గెలిపిస్తే మేట్టుపాళయం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని కల్లార్ గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని నీలగిరి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. మేట్టుపాళయం భజన కోయిల్ వీధి, మార్కెట్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం ప్రచారంలో పాల్గొన్న ఎల్.మురుగన్, వ్యాపారులకు కరపత్రాలు పంపిణీ చేసి 'కమలం' గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలంటూ అభ్యర్థించారు. ఆ సమయంలో అక్కడున్న వ్యాపారులు, నీలగిరి ప్రాంతంలో గెలిచిన ఎంపీలెవ్వరూ ఇప్పటివరకు తమ సమస్యల్లో ఒక్క దానిని కూడా పరిష్కరించలేదని మురుగన్ వద్ద ఏకరువు పెట్టారు. అందుకు ఆయన, తనను ఎంపీగా గెలిపిస్తే వెనుకబడిన కల్లార్ గ్రామాన్ని దత్తత తీసుకొని ఆ గ్రామానికి అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తానని హామీ ఇచ్చారు.


రామనాథపురంలో ఓపీఎస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న నడ్డా

డీఎంకేని సాగనంపుదాం

● నడ్డా గారి పిలుపు

● బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

చెన్నై,ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి):లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే గెలిచి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, జూన్ 4వ తేదీ తర్వాత మోదీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుతారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. మంగళవారం ఉదయం రామనాథపురం నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి తరఫున స్వతంత్ర అభ్యర్థిగా పనసపండు గుర్తుపై పోటీ చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వంకు మద్దతుగా ఆయన ఓపెన్‌టాప్ వ్యాన్‌లో ప్రచారం చేశారు. గాంధీ విగ్రహం కూడలి వద్ద నడ్డా ప్రసంగిస్తూ... తమిళ రాజకీయ దిగ్గజం, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వంకు మద్దతుగా ప్రచారం చేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఓపీఎస్ తమిళ ప్రజల కోసం తపించే వ్యక్తి అనీ ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికలను సాదాసీదాగా భావించవద్దని, 2047లో దేశాన్ని సంపన్న దేశంగా మార్చేందుకు తపిస్తున్న ఎన్డీయేని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతి, కుటుంబ పాలనకు నిలువెత్తు నిదర్శనమే డీఎంకే ప్రభుత్వమని ఆయన అన్నారు.


బాబును ప్రశ్నిస్తున్న రైతులు

● నిరసన సెగ

అన్నాడీఎంకే అభ్యర్థిని చుట్టుముట్టిన రైతులు

ప్యారీస్, ఏప్రిల్ 16: మైలాడుదురై లోక్‌సభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాబును చెరకు రైతులు చుట్టుముట్టి ప్రశ్నల వర్షం కురిపించిన ఘటన కలకలం రేపింది. అన్నాడీఎంకే నిర్వాహకులతో కుంభకోణం సమీపంలోని పట్టవర్తి ప్రాంతంలో బాబు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ విషయం తెలిసి తిరుమనంకుడి చక్కెర ఫ్యాక్టరీ ముందు 504 రోజులుగా రిలే దీక్షలో పాల్గొంటున్న చెరకు రైతులు బాబును చుట్టుముట్టారు. ప్రతిపక్ష పార్టీగా ఉన్న అన్నాడీఎంకే తరఫున తమ సమస్యను పరిష్కరింపజేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారంటూ బాబును నిలదీశారు. హక్కుల కోసం పోరాడుతున్న అన్నదాతలను పట్టించుకోని మీకు మా ఓట్లు మాత్రం కావాలా అంటూ సూటిగా ప్రశ్నించారు. సుమారు 30 నిమిషాలపాటు సాగిన వాగ్వాదం అనంతరం బాబు రెండు చేతులతో దండం పెట్టి, తాను గెలిచిన తర్వాత రైతుల సమస్య పరిష్కరిస్తానంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

● చరిత్రలో కీలక ఘట్టం

నేనూ భారతీయురాలినే

● ఓటు వేయబోతున్న శ్రీలంక శరణార్థి నళిని ఆనందం


ఓటరు గుర్తింపు కార్డును చూపుతున్న నళిని కృపాకరన్

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): 'ఈ నెల 19న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తొట్టతొలిసారిగా ఓటు వేయబోతున్నా. దీంతో నేను భారతీయురాలినని లోకానికి ఎలుగెత్తి చాటబోతున్నా. ఎన్నో యేళ్లనాటి కల ఇది. ఓటేసిన తర్వాతే ఈ దేశంలో జీవిస్తున్నానని సగర్వంగా భావిస్తా' అంటూ తిరుచ్చి జిల్లా కొట్టపట్టులోని శ్రీలంక శరణార్థుల పునరావాస శిబిరంలో నివసిస్తున్న నళిని కృపాకరన్(38) భావోద్వేగానికి గురయ్యారు. 1986లో రామేశ్వరం సమీపం మండపంలోని శ్రీలంక శరణార్థుల శిబిరంలో ఆమె జన్మించారు. కొన్నేళ్లుగా ఆమె భారతదేశ పౌరసత్వం కోసం సుదీర్ఘ న్యాయపోరాటం సాగించారు. 2021లో ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలో పాస్‌పోర్ట్ జారీ చేయడానికి అధికారులు నిరాకరించినప్పటి నుంచి ఈ పోరాటం ప్రారంభమైంది. మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. నళిని మండపం వద్ద జన్మించినట్లు జనన ధ్రువీకరణ పత్రం ఉండటంతో ఆమెకు భారతీయ పాస్‌పోర్టును జారీ చేయాలని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ న్యాయమూర్తి జీఆర్ సామినాథన్ 2022న ఉత్తర్వు జారీ చేశారు. భారత పౌరసత్వ చట్టం 1995 ప్రకారం 1950 జనవరి 26 నుంచి 1987 జూలై 1వ తేదీ లోగా భారత దేశంలో జన్మించిన వారంతా భారతదేశ పౌరులవుతారనే చట్ట సవరణ ప్రకారం ఆమె పాస్‌పోర్ట్ జారీ అయ్యింది. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ జారీ చేసిన ప్రత్యేక అనుమతితో తిరుచ్చి శిబిరంలోనే నివసిస్తున్నారు. ప్రస్తుతం తిరుచ్చి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల వివరాలు తనకు బాగా తెలుసునని నళిని చెబుతున్నారు. గత వారం ఆమెకు ఓటరు గుర్తింపు కార్డు కూడా జారీ చేశారు. దీంతో ఆమె సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయింది. తనకు లభించిన ఈ సదుపాయాలన్నీ పునరావస శిబిరంలోని వారందరికీ లభించాలన్నదే తన ఆశయమని చెప్పారు. తన చిరకాల కోరిక నెరవేరిందని, తొలిసారిగా శరణార్థుల పునరావాసంలో జన్మించినవారిలో తొట్టతొలి ఓటరుగా తాను ఓటు హక్కును వినియోగించుకోనున్నానని నళిని చెప్పారు. యేళ్ల తరబడి రాష్ట్రంలోని శ్రీలంక శరణార్థుల పునరావాస కేంద్రాలలోని శ్రీలంక తమిళులందరికీ భారతదేశ పౌరసత్వం కల్పిస్తామని హామీ ఇచ్చే పార్టీకే తాను ఓటు వేయనున్నట్లు ఆమె తెలిపారు. తన న్యాయపోరాటం ఇంతటితో ఆగదని, భారతదేశంలోనే జన్మించిన తన ఇద్దరు పిల్లల పౌరసత్వం కోసం పోరాడుతున్నానని చెప్పారు. తనలాగే శిబిరాలలో జన్మించి 20 యేళ్లుగా జీవనం సాగిస్తున్నవారంతా పౌరసత్వం కోసం పోరాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ తమకు కూడా అమలవుతున్నాయని ఆమె చెప్పారు. తనకు లభించినట్లే రాష్ట్రంలోని శిబిరాలలో జన్మించినవారందరికీ ఓటు హక్కు కల్పించాలని అప్పుడే తామంతా భారతీయులమంటూ తలెత్తుకుని బతుకగలమని నళిని కృపాకరన్ తెలిపారు.



అభివృద్ధి నిరోధకులకు బుద్ధి చెప్పండి

● వినోజ్ పి.సెల్వం విజ్ఞప్తి

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో విజయం సాధించాక, ప్రజలకు కనీసం ముఖం చూపని అభివృద్ధి నిరోధకులకు ఈ ఎన్నికల్లోనైనా బుద్ధి చెప్పాలని సెంట్రల్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభివృద్ధి వినోజ్ పి.సెల్వం పిలుపునిచ్చారు.మంగళవారం నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేపట్టిన ఆయన మాట్లాడుతూ...సిట్టింగ్ ఎంపీ దయానిధి మారన్ ఏనాడైనా నియోజకవర్గంలోని ఒక్క వీధిలోనైనా పర్యటించారేమో ప్రజలు గ్రహించాలన్నారు. ఎంపీగా రాజభోగాలు అనుభవించేందుకా ప్రజలు ఓటేసి గెలిపించిందని నిలదీశారు. ప్రజా సేవలో ఉండాల్సిన వ్యక్తి, రాజమహళ్లలో సకల సుఖాలు అనుభవిస్తూ, ప్రజా సమస్యల్ని గాలి కొదిలేశారని, ఇలాంటి వ్యక్తిని ఇకనైనా దూరంగా పెట్టాలని అభ్యర్థించారు. తనను గెలిపిస్తే నిత్యం ప్రజల్లోనే ఉంటానని, తాను ప్రజలకు దూరంగా జరిగితే నిలదీయవచ్చని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే తాను ప్రజల్లో తిరుగుతున్నానని, నియోజకవర్గమంతా తనకు వీధివీధినా పరిచయమేనన్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని వినోజ్ పి.సెల్వం హామీనిచ్చారు.


ఎన్నికల ప్రచారంలో బత్తాయి రసం పిండుతున్న ఉత్తర చెన్నై లోక్‌సభ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి రాయపురం మనో


నీలగిరి లోక్‌సభ నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి ఎ.రాజాకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో మంత్రి టీఎం అన్బరసన్


కరూర్ లోక్‌సభ నియోకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జ్యోతిమణితో కరచాలనం చేసేందుకు పోటీ పడుతున్న మహిళలు

● జోస్యం ఫలించేనా?

మీదే విజయం

● తమిళిసైకు రోబో ఉవాచ



ఐసీఎఫ్, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికల్లో విజయం ఖాయమని బీజేపీ అభ్యర్థి తమిళిసైకు రోబో జోస్యం చెప్పింది. దక్షిణ చెన్నై లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తమిళిసైకు మద్దతుగా కేంద్రమంత్రి వీకేసింగ్... షోళింగనల్లూర్ నియోజకవర్గంలో సోమవారం ప్రచారం చేశారు. తమిళిసై విజయావకాశంపై ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే రోబో వద్ద జోస్యం అడిగారు. 'రెండు గవర్నర్ పదవులు వదిలి ప్రజాసేవకు వచ్చారు. తమిళభాష అభివృద్ధికి బీజేపీ ఇచ్చే ప్రాధాన్యం, మేనిఫెస్టో రాష్ట్ర ప్రజలను ఆకట్టుకుంటోంది. దక్షిణ చెన్నై ప్రజల సంక్షేమ పథకాలు నెరవేర్చడం మీవల్లే సాధ్యం. తప్పక విజయం సాధిస్తారు. అభినందనలు" అంటూ పేర్కొంది.

● ఆరోపణ

అంబులెన్స్‌లో నగదు తరలిస్తున్న ప్రధాన పార్టీలు


ప్రసంగిస్తున్న సీమాన్

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాలక, ప్రతిపక్షాలు సహా జాతీయ పార్టీలు ఓటర్లకు డబ్బులు పంచిపెట్టేందుకు అంబులెన్స్‌లలో భారీగా కరెన్సీ నోట్లను తరలిస్తున్నాయని నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్ ఆరోపించారు. విల్లుపురంలో పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థి, దర్శకుడు కళంజియంకు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం కావేరి డెల్టా జిల్లాలకు సాగుజలాలను విడుదల చేసేందుకు నిరాకరిస్తోందని, అలాంటప్పుడు రాష్ట్రంలో ఆ పార్టీ అభ్యర్థులను ఓటెయ్యడం న్యాయమేనా అని ప్రశ్నించారు. పదేళ్ల మోదీ పాలన ట్రైలర్ మాత్రమేనని, మళ్లీ గెలిపిస్తేనే మెయిన్ పిక్చర్ చూపుతామంటూ బీజేపీ నేతలు చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. ట్రైలర్‌కే పదేళ్ల పడితే మెయిన్ పిక్చర్‌కు ముప్ఫై యేళ్లు పడుతుందేమోనని సీమాన్ ఎద్దేవా చేశారు. పదేళ్లుగా రాష్ట్రాభివృద్ధికి నిధులు విడుదల చేయని ప్రధాని మోదీ... అసత్యాలతో ఓట్లు దండుకోవాలని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

మోదీ వందసార్లు వచ్చినా కమలం వికసించదు

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై



ప్యారీస్, ఏప్రిల్ 16: ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి వంద సార్లు వచ్చినా కమలం వికసించే ప్రసక్తే లేదని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై పేర్కొన్నారు. స్థానిక రాయపేటలోని టీఎన్‌సీసీ కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తుండడంతో ప్రధాని మోదీ రాష్ట్రం వైపు కన్నేసి వారానికోసారి పర్యటన వచ్చి వెళుతున్నారన్నారు. ఆయన 100 సార్లు వచ్చినా బీజేపీ గెలిచే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర ప్రజలను, తమిళ జాలర్లను మభ్యపెట్టేలా బీజేపీ తన ఎన్నికల అస్త్రంగా కచ్చాదీవి సమస్యను తెరపైకి తెచ్చిందని, పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ దాన్ని విడిపించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు.

చిత్రజ్యోతి

ఇప్పటికైతే అలాంటి ఆలోచన లేదు

● విజయ్ ఆంటోని



రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన తనకు లేదని హీరో విజయ్ ఆంటోని అన్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'రోమియో'. ఇటీవల విడుదలై హిట్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బులు ఇస్తే ఓటర్లు తీసుకుని మీకు నచ్చిన మంచి అభ్యర్థికి ఓటు వేయాలని సూచించారు. ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా, వివాదాస్పదంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇటీవల మదురైకు వెళ్లిన ఆయన్ను ఇదే అంశంపై మీడియా ప్రశ్నించగా, తన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చారు. 'ఓటుకు డబ్బులు తీసుకోవడం మంచిదని నేను చెప్పలేదు. పేదరికంలో మగ్గుతున్నవారు డబ్బులు తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ.. ఇలాంటి వారు మంచి వారిని ఎంచుకుని ఓటు వేయాలని కోరా. నేను సాధారణంగా మాట్లాడే విషయాన్ని వివాదాస్పదం చేస్తున్నారు. అలాంటి ఆలోచనలు నాకు లేదు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయి. కానీ, భారత్‌లో మాత్రం శాంతియుత వాతావరణం నెలకొంది. ఎవరు అధికారంలోకి వచ్చినా ఈ శాంతిని కాపాడుతారు. భవిష్యత్తులో రాజకీయాలకు వచ్చే విషయంపై ఇప్పటికైతే ఎలాంటి ఆలోచన లేదు' అని పేర్కొన్నారు.

మే 3న తెరపైకి వరలక్ష్మి శరత్‌కుమార్ 'శబరి'

మహా మూవీస్ పతాకంపై అనిల్ కాట్జ్ దర్శకత్వంలో వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రను పోషించిన 'శబరి' చిత్రం మే 3న విడుదల చేసేందుకు ప్లాన్ చేశారు. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల చేస్తున్నారు. ఇందులో వరలక్ష్మితో పాటు గణేశ్ వెంకట్రామన్, శశాంక్, మైమ్ గోపి, సునైనా, రాజశ్రీ నాయర్, మధునందన్ తదతరులు ఇతర పాత్రలను పోషించారు. సైకలాజికల్ థ్రిల్లర్ బాణీలో రూపొందించిన ఈ చిత్రంలో ఎమోషనల్, థ్రిల్లింగ్ వంటి కథాంశాలతో ప్రేక్షకులను ఉత్కంఠకు లోనుచేసేలా తెరకెక్కించినట్టు దర్శకుడు వివరించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అనిల్ కాట్జ్, సంగీతం గోపి సుందర్, నిర్మాత మహేంద్రనాథ్ కొండ్ల.


'శబరి'లో వరలక్ష్మి శరత్‌కుమార్

'హంటర్'గా రాఘవ లారెన్స్



నృత్య దర్శకుడు, హీరో, దర్శకుడు, నిర్మాత రాఘవ లారెన్స్ వరుస చిత్రాలకు కమిట్ అవుతున్నారు. తమిళ కొత్త సంవత్సరాది రోజున ఆయన ఏకంగా రెండు చిత్రాలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. వీటిలో ఒకటి 'హంటర్'. రెండోది 'బెన్స్'. 'హంటర్' సినిమా లారెన్స్ నటించే 25వ చిత్రం. రెండు విభిన్న పాత్రల్లో కనిపించే ఈ చిత్రానికి వెంకట్ మోహన్ దర్శకుడు. జూన్ నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ సినిమాలో లారెన్స్ సరసన బాలీవుడ్ నటి, ప్రతి నాయకుడిగా హిందీ నటుడు నటించనున్నట్టు సమాచారం. అంతేకాకుండా, ఈ సినిమాలో పులి కూడా ఓ ముఖ్య పాత్రను పోషించనుంది. హీరోకు - పులికి మధ్య ఉండే స్నేహం, ప్రేమ వంటి అంశాలతో ఈ సినిమాను రూపొందించేలా దర్శకుడు స్క్రిప్టును సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.